క్లుప్తంగా

గుడాల పంపిణీ



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని రాంనగర్‌లో పద్మశాలి సంఘం ఐదవ తర్ప ఆధ్వర్యంలో కామదహనం కార్యక్రమంలో భాగంగా సంఘం సభ్యులకు గుడాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణను అందరూ కాపాడాలన్న ఉద్దేశంతో సంఘం సభ్యులకు ఉచితంగా టిఫిన్‌ బాక్స్‌లలో గుడాలను ఉచితంగా అందజేశామన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణ పరిరక్షణకు స్టీల్‌ బాక్సులు, వస్త్ర బ్యాగులు వినియోగించాలని కోరారు. సంఘం అధ్యక్షుడు కట్కం నరేందర్‌, కార్యదర్శి బోగ గంగాధర్‌, కోశాధికారి పురుషోత్తం, కార్యవర్గ సభ్యులు సుధాకర్‌, శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు..

బోనాలకు సర్వం సిద్ధం



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ ముదిరాజ్‌ సంఘం ఆధ్వర్యంలో కులదైవమైన పెద్దమ్మ తల్లికి బోనాల సమర్పణకు అంతా సిద్ధమైనట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఆర్మూర పట్టణంలోని నిజామాబాద్‌ రోడ్డులో ఉన్న పెద్దమ్మ ఆలయం పరిసర ప్రాంతాలను జేసీబీ సహాయంతో అంతా శుభ్రపరిచారు. ఈ నెల 12న నిర్వహించే బోనాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కులపెద్దలు పేర్కొన్నారు. పెద్దబజార్‌ ముదిరాజ్‌ సంఘం అధ్యక్షుడు మందుల పోశెట్టి, జక్కం గంగాధర్‌, జక్కం ప్రసాద్‌, ఆనంద్‌ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు హోలీ సంబురాలు



నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌లో ఆదివారం ముందస్తు హోలీ పండుగ నిర్వహించారు. సోమవారం గ్రామంలో ఉపవాసాలు ఉండటంతో వీడీసీ నిర్ణయం మేరకు ఆదివారం పండుగ జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు, పెద్దలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఉత్సాహంగా జరుపుకున్నారు.

ప్రశాంతంగా ఏఈ పరీక్ష

నిజామాబాద్‌ అర్బన్‌ : జిల్లా కేంద్రంలో ఆదివారం టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఈ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 3,170 అభ్యర్థులకు గాను 2,542 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 628 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2,537 మంది హాజరయ్యారు. 633 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



ధర్పల్లి (ఇందల్వాయి): ప్రతిరోజు సైకిల్‌ తొక్కడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని మండల వైద్యాధికారి సంతోష్‌కుమార్‌ తెలిపారు. ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మహిళా ఆరోగ్య సిబ్బంది సైకిల్‌ ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా సంతోష్‌ మాట్లాడుతూ.. ప్రతిరోజు సైకిల్‌ తొక్కడం ద్వారా శారీరక బరువు, రక్తపోటును నియంత్రించవచ్చని తెలిపారు. గుండె జబ్బుల ద్వారా సంభవించే మరణాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు అరుంధతి, భానుప్రియ తదితరులున్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి కృషి చేయాలి



నిజామాబాద్‌ సిటీ: విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి సంఘ సభ్యులు కృషి చేయాలని జిల్లా అధ్యక్షు డు సత్యప్రకాష్‌చారి అన్నారు. నగరంలోని ఆర్యనగర్‌ విశ్వబ్రాహ్మణ సంఘం భవనంలో ఆదివారం సంఘ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్యనగర్‌ విశ్వబ్రాహ్మణ సంఘం మరింత అభివృద్ధి చెందాలన్నారు. ప్రతినెలా సంఘం సమావేశం నిర్వహించి, సంఘం అభివృద్ధికి తీసుకుంటున్న చర్య లు సమావేశంలో చర్చించాలన్నారు.

నిరుపయోగంగా క్రీడా పరికరాలు

- ఆర్మూర్‌ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కు లో పాడైన ఆట వస్తువులు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్న చిన్నారులు





హౌసింగ్‌బోర్డు పార్కులో పాడైపోయిన చిన్నారుల ఆట వస్తువులు

ఆర్మూర్‌టౌన్‌ : చిన్నారులు ఆటలాడుకోవడానికి ఆర్మూర్‌ పట్టణంలోని పార్కుల్లో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు పనికి రాకుండా పోయాయి. ఆర్మూర్‌ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కు లో రెండు ఊయలలు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. మిగతా ఆట వస్తువులు పూర్తిగా విరిగిపోయి ఉండటంతో ఆడుకునేందుకు వీలు లేకుండా ఉన్నాయి. పనికి రాకుండా పోయిన పరికరాలకు మరమ్మతులు చేసి పిల్లలు ఆడుకునేలా వినియోగంలోకి తెస్తే బాగుంటుందని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గతంలో జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన నారాయణ రెడ్డి, హౌసింగ్‌ బోర్డు పార్కును సందర్శించి చెడిపోయిన ఆట వస్తువుల స్థానంలో నూతన ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని ఆదేశించినా ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కాలనీవాసులు మున్సిపల్‌ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. వేసవి కాలం ప్రారంభమవుతున్నందున పార్కుకు వచ్చే చిన్నారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కులో క్రీడా పరికరాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం



హౌసింగ్‌ బోర్డ్‌ పార్కును త్వరలో పరిశీలించి చెడిపోయిన ఆట వస్తువులకు మరమ్మతులు చేయిస్తాం. చిన్నారులు ఆడుకునే విధంగా అన్ని విధాలా చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్‌ చౌహాన్‌, మున్సిపల్‌ కమిషనర్‌, ఆర్మూర్‌

మట్టి స్నానంతో రోగనిరోధక శక్తి



రుద్రూర్‌లో మట్టి స్నానం చేస్తున్న ప్రజలు

రుద్రూర్‌: మట్టి స్నానంతో రోగ నిరోధక శక్తిని పెరుగుతుందని పతంజలి రాష్ట్ర సోషల్‌ మీడియా అధ్యక్షులు విశ్వనాథ్‌ మహాజన్‌ అన్నారు. రుద్రూర్‌ మండల కేంద్రంలోని పల్లె పకృతి వనంలో యజ్ఞ సహిత యోగ కేంద్రం, వివిధ యోగ కేంద్రాల ఆధ్వర్యంలో మడ్‌బాత్‌(మట్టి స్నానం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాది హోలీకి ముందు మడ్‌ బాత్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వనాథ్‌ వెల్లడించారు. పంచ మహా భూతాలలో ఒకటైన భూమి చాలా అమూల్యమైనదని, పుట్టమన్ను, చెరువు మన్నును శరీరానికి పూసి ఒక గంట సేపు సూర్యుని ముందు నిలబడి యోగ, ప్రాణాయామం చేయడం వల్ల వివిధ రకాల చర్మ రోగాలు దూరమవుతాయని అన్నారు. కార్యక్రమంలో పెగడాపల్లి ఎంపీటీసీ భూమిరెడ్డి, మంచాల శ్రీనివాస్‌, పొట్టి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

చర్మవ్యాధులూ దూరం

ఎడపల్లి(బోధన్‌): మట్టి స్నానంతో కలిగే ఉపయోగాలను ప్రజలకు తెలియజెప్పడానికి గత కొన్నేళ్లుగా పతంజలి యోగ శిక్షణ సంస్థ విశేష కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఏటా అలీ సాగర్‌లో మట్టి స్నానం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల కు అవగాహన కల్పిస్తున్నారు. తాజాగా ఆదివారం ఎడపల్లి మండలంలో అలీసాగర్‌లో మట్టి స్నానం నిర్వహించి దీని ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియజేశారు.



చిన్నారికి మట్టి స్నానం చేయిస్తున్న దృశ్యం



ఎడపల్లి మండలం అలీసాగర్‌లో పతంజలి యోగ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మట్టిస్నానం

ప్రభుత్వాస్పత్రిలో పందుల విహారం



బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రిలో వంటశాల ముందు సంచరిస్తున్న పందులు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు
- పట్టించుకోని ఆస్పత్రి సిబ్బంది

బాల్కొండ: మండల కేంద్రంలో ప్రభుత్వాస్పత్రి ఆవరణలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో ఇది వరకే ఆసుపత్రికి వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు పందులో తలనొప్పిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో బాలింతలు, వారి వద్ద ఉండే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఈ మధ్యనే ఆస్పత్రి ఆవరణలో వంట శాల కూడా నిర్మించారు. కాని ఆ వంటశాలలోకి పందులు చొరబడి హంగామా చేస్తున్నాయి. ఆస్పత్రి చుట్టూ పందులే కనిపిస్తున్నాయి. కొన్ని సార్లు పందులు తిరగబడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అయిన అధికారులు వాటిని రాకుండ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఉన్నత అధికారులు స్పందించి పందుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తున్నారు.

రోగులకు ఏది తీసుకెళ్లాలన్నా భయమే..

ప్రభుత్వాస్పత్రిలో వానర దండు ఉండటంతో చికిత్స పొందుతున్న రోగులకు ఏవైనా ఆహార పదార్థాలు తీసుకెళ్లాలంటే భయంగా ఉంటుంది. ఆస్పత్రి ద్వారం వద్దకు వెళ్లామంటే చాలు కోతులు వెంటబడుతూ.. చేతుల్లో ఉండే ఆహారాన్ని లాక్కెళ్తున్నాయి. వంటశాల వద్ద పందుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఊరేగింపునకు ఘన స్వాగతం

వర్ని: బాన్సువాడలో ఈ నెల 11న రామారావు మహరాజ్‌ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటంతో బాన్సువాడ నియోజకవర్గంలో ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఊరేగింపు వర్ని మండల కేంద్రానికి చేరుకుంది. మండల కేంద్రంతో పాటు మల్లారం, డిపో తండా, సేవాలాల్‌ తండా, అంతాపూర్‌, పుట్టిగుట్ట గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించగా మహిళలు, పురుషులు, గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై స్వాగతం పలికారు. 11న జరిగే విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా బంజారా సేవా సంఘం అధ్యక్షులు బద్యా నాయక్‌ కోరారు.



వర్నిలో స్వాగతం పలుకుతున్న మహిళలు

అభివృద్ధి పనులకు భూమి పూజ



పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లిలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జీవన్‌ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. మామిడిపల్లిలో 2 ఎకరాల్లో నిర్మిస్తున్న మున్నూరు కాపు సంఘం కల్యాణ మండపానికి ఎమ్మెల్యే రూ. 50 లక్షల నిధులను ఇది వరకే మంజూరు చేశారు. కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అలాగే 1,200 గజాల స్థలంలో నిర్మిస్తున్న మేరు సంఘం కల్యాణ మండప నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. దీంతో పాటు పీఎంపీ, గౌడ్స్‌ ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌ కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ ఎల్‌ఎంబీ రాజేశ్వర్‌, మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పండిత్‌ వినీత, వైస్‌ చైర్మన్‌ షేక్‌ మున్ను, బీఆర్‌ఎస్‌ నేతలు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ ఉంటుందని పేర్కొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి ఆర్థిక సాయం



పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆలూర్‌ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఆర్మూర్‌ నియోజకవర్గ కురుమ సంఘం కల్యాణ మండపానికి అదే గ్రామానికి చెందిన కురుమ చిన్న సంఘం ఆదివారం రూ.40 వేలను తమవంతు సహాయంగా అందజేశారు. గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కురుమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కేజీ సురేష్‌కు డబ్బులను అందజేశారు. కురుమ సంఘం నాయకులు రాజు, సతీష్‌, మల్లేష్‌, రాములు, అజయ్‌ పాల్గొన్నారు.

నగరంలో ఉచిత వైద్యశిబిరం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పద్మశాలి ఉన్నత పాఠశాలలో ఆదివారం శాలిని హార్ట్‌ హాస్పిటల్‌, గౌతమి మహిళా వినియోగదారుల సంఘం, జిల్లా పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గుండె, చెవి, ముక్కు, గొంతు, క్యాన్సర్‌, ఎముకలు, చర్మవ్యాధుల వైద్యులు కూరపాటి కల్యాణ్‌, సుభాష్‌, కార్తీక్‌, గుజ్జేటి నవీన్‌, శ్యాంసుందర్‌ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యులు సుభాష్‌ , గుజ్జ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు

గ్యాస్‌ ధరలు తగ్గించాలని రాస్తారోకో



రుద్రూర్‌: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్‌ ధరలను తగ్గించాలని డిమాండ్‌ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గోవూర్‌ వద్ద స్థానికులు రాస్తారోకో చేశారు. మోస్రా మండలంలోని గోవూర్‌ –నిజామాబాద్‌ ప్రధాన రహదారిపై ఆదివారం రాస్తారోకో చేపట్టి ఆందోళన చేశారు. పెంచిన వంట గ్యాస్‌ ధరలను తగ్గించాలని నినాదాలు చేశారు. లేనట్టయితే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నన్నేసాబ్‌, సత్యనారాయణ, మగ్బూల్‌, వార్డు సభ్యురాలు మహిముదా, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్‌ ప్లీజ్‌..



నర్సింహస్వామి ఆలయ సమీపంలో చెత్త వేయడానికి వీలులేకుండా ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు

ఆర్మూర్‌లోని నర్సింహస్వామి ఆలయ సమీపంలో చెత్తబుట్టలు ఉన్నా వాడుకోవడానికి వీలుకాకుండా ఉన్నాయి. దీంతో కాలనీవాసులకు చెత్త ఎక్కడ వెయ్యాలో అర్థం కావడం లేదు. చాలా మంది చెత్త బుట్ట పక్కన వేసి వెళ్లిపోతున్నారు. చెత్తబుట్టలను సరైన స్థలంలో ఏర్పాటు చేసేలా మున్సిపల్‌ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– ఆర్మూర్‌టౌన్‌

ప్రశ్నించాల్సిన అధికారి పేరు:
మహేశ్‌, సానిటరీ ఇన్‌స్పెక్టర్‌, ఆర్మూర్‌

ఫోన్‌ నంబర్‌ :
99633 75851

పొద్దుగల్లనే మందు అమ్ముతున్నరు!

- బాల్కొండలో ఉదయం 5 గంటల నుంచే మందు విక్రయాలు
- వైన్స్‌ నిర్వాహకులే అమ్ముతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వీడీసీ
- పట్టించుకోని ఎక్సైజ్‌ శాఖ అధికారులు



తాగి రోడ్డు పక్కన పడిపోయిన మందు బాబు



బాల్కొండ మండల కేంద్రంలో ఉదయం 5 గంటలకు మందు విక్రయిస్తున్న దృశ్యం

బాల్కొండ: మాది బాల్కొండ మండల కేంద్రం.. బాల్కొండకు రాష్ట్ర స్థాయిలో మంచి పేరుంది.. కాని మా ఊళ్లో పొద్దుగల్ల 5 గంటల నుంచే మందు అమ్ముతున్నారు అంటూ బాల్కొండ వీడీసీ సభ్యులు స్వయంగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అంటే బాల్కొండ మండల కేంద్రంలో బెల్ట్‌ దందా ఏ స్థాయిలో నిర్వహిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. వైన్స్‌ షాపులో సిట్టింగ్‌ రూంలను బెల్ట్‌ షాపులుగా మార్చి ఉదయం 5 గంటల నుంచే మందు విక్రయిస్తున్నారు. పాత జాతీయ రహదారి ఆనుకుని మండల కేంద్రంలో రెండు వైన్స్‌ షాపులు నిర్వహిస్తున్నారు. వాటి పక్కనే సిట్టింగ్‌ గదులను, కూల్‌డ్రింక్‌ షాపులను బెల్ట్‌ షాపులుగా చేసుకుని ఉదయం 5 గంటల నుంచి వైన్స్‌ షాపులు తెరిచే సమయం వరకు అక్కడ అమ్ముతున్నారు. తరువాత వైన్స్‌ షాపులో విక్రయిస్తున్నారు. పక్కన బెల్ట్‌ షాపులో క్వార్టర్‌ రూ.10 ఎమ్మార్పీ ధర కంటే అదనంగా తీసుకుంటున్నారు. ఇలా వారి దందాను మూడు ఫుల్‌ బాటిళ్లు.. ఆరు క్వార్టర్లుగా మలుచుకుంటున్నారు. ఉదయం నుంచే మద్యం సేవించిన మద్యం ప్రియులు, బెల్ట్‌ షాపుల ముందే కింద పడి దొర్లుతున్నారు. రోడ్డుపై వెళ్లే వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఉదయం నుంచే మద్యం దొరకడంతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తాగుడికి బానిసైన అనేక మంది రోగాల బారిన పడుతున్నారు. ఆస్తులను అమ్మి తాగుడుకు పెడుతున్నారని పలు కుటుంబాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా వీడీసీ సభ్యులే ఫిర్యాదు చేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఉన్నత అధికారులు స్పందించి బెల్ట్‌ దందాకు చెక్‌ పెట్టాలని పలువురు డిమాండ్‌ చేస్తున్నారు.

బానిసలవుతున్నారు

బాల్కొండ మండల కేంద్రంలో రెండు వైన్స్‌షాపుల వద్ద పక్క గదుల్లో పొద్దున్నుంచే మందు అమ్ముతున్నారు. జిల్లా కలెక్టర్‌కు కూడ ఫిర్యాదు చేశాం. అనేక మంది తాగుడుకు బానిసలవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– అశోక్‌, వీడీసీ అధ్యక్షుడు, బాల్కొండ

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

బోధన్‌టౌన్‌(బోధన్‌): ప్రతి ఒక్క విద్యార్థి పట్టుదలతో చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఐఈవో రఘురాజ్‌, ఆర్డీవో రాజేశ్వర్‌ అన్నారు. శనివారం పట్టణంలోని విజయ సాయి జూనియర్‌ కళాశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఇంటర్‌ విద్యార్థులకు ఇది కీలక దశ అని, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని, ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌ను బంగారు బాట చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల నృత్యాలు అలరించారు. ఇంటర్‌ ప్రథమ సంవత్సరంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్డీవో, డీఐఈవోలు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌ సుబ్బారావు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న డీఐఈవో, ఆర్డీవో

'ముప్కాల్‌'కు ఎస్సై కావలెను!

- పీఎస్‌లో 2 నెలలుగా ఎస్సై పోస్టు ఖాళీ
- ముప్కాల్‌ రావాలంటే జంకుతున్న వైనం



బాల్కొండ: ముప్కాల్‌ పోలీస్‌ స్టేషన్‌లో 2 నెలల నుంచి ఎస్సై పోస్టు ఖాళీగా ఉంది. నూతన మండలాల ఏర్పాటులో భాగంగా ముప్కాల్‌ మండల కేంద్రం ఏర్పడింది. ఇది వరకు ఐదుగురు ఎస్సైలు వచ్చి బదిలీపై వెళ్లిపోయారు. చివరిసారి ఎస్సైగా విధులు నిర్వహించిన ప్రభాకర్‌రెడ్డి నెలన్నర క్రితం బదిలీపై నిర్మల్‌కు వెళ్లిపోయారు. అధికార పార్టీ సర్పంచ్‌, ఎస్సై తమకు అనుకూలంగా మెదలడం లేదని పైవారికి ఫిర్యాదు చేశాడని తెలియడంతో మనస్తాపంతో సొంత జిల్లాకు బదిలీ చేసుకున్నట్లు తెలిసింది. ముప్కాల్‌ మండలం ఏడు గ్రామాలతో ఏర్పడింది. పెద్ద పోలీస్‌ స్టేషన్‌ కాకపోవడంతో ఎస్సైలు రావడానికి సుముఖత చూపడం లేదు. ముప్కాల్‌ పోలీస్‌స్టేషన్‌కు ఎస్సైలు రావడానికి జంకుతున్నారు. మండల కేంద్రంలో అధికార పార్టీ నాయకుల మధ్య కొంత కాలంగా ముసలం రాజుకుంది. దీనికి ఎవరి వైపు కేసులు నమోదు చేసినా ఎస్సైలకు తిట్ల పురాణం తప్పడం లేదు. ఈ రాజకీయాలను తట్టుకోలేక ఎవరు పోస్టింగ్‌ తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. ప్రస్తుతం బాల్కొండ ఎస్సైకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు. ఉన్నత అధికారులు స్పందించి ఎస్సైని నియమించాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.